క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: శ్రీరామ్‌నగర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు కానూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్‌నగర్, కేసీపీ కాలనీ, సూపర్‌విజ్ రోడ్డు, పంటకాలువ రోడ్డు, తాడిగడప సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రామవరప్పాడు: విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎంపీఎస్ రోడ్డు, ఆంధ్రా బ్యాంక్ ఏరియా, పాళ్ల బజారు, కొళ్ల ఫారం రోడ్డు, శక్తి కల్యాణ మండపం రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తుదిదశకు డ్రెయిన్ నిర్మాణ పనులు



కంకిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో చేపట్టిన సిమెంటు డ్రెయిన్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీఓ, ఐసీడీఎస్, తహసీల్దార్, హౌసింగ్, వెలుగు, ఇతర ఇంజినీరింగ్ శాఖల విభాగాలు ఉన్నాయి. నిత్యం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఆయా కార్యాలయాలకు వస్తుంటారు. అయితే చిన్న పాటి వర్షం కురిసినా ప్రాంగణంలో నీరు నిలిచి చెరువును తలపిస్తుంది. రోజుల తరబడి మురుగు కదలని పరిస్థితి. సమస్యపై పలుమార్లు పత్రికల్లో వచ్చిన కథనాలకు మండల పరిషత్ పాలకవర్గం స్పందించింది. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 11.45 లక్షలు సిమెంటు డ్రెయిన్ నిర్మాణానికి కేటాయించింది. ఈ నిధులతో మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రహరీగోడ వెంబడి డ్రెయిన్ నిర్మిస్తున్నారు. ఈ పనులు తుదిదశకు వచ్చాయి. వర్షం కురిస్తే ఏర్పడే మురుగు సమస్యకు డ్రెయిన్ పరిష్కార మార్గం అవుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

వివాహితను బెదిరించి చోరీ

పెనమలూరు: పోరంకిలో వివాహితను బెదిరించి బంగారు ఆభరణాలు, సొమ్ము దోచుకున్నారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. పోరంకి జాబిల్లి ఆస్పత్రి ప్రాంతంలో మీసాల పల్లవిసాయికీర్తి భర్త ధర్మేంద్రతో కలిసి ఉంటుంది. కాగా గురువారం రాత్రి భర్త ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఇంటికి వచ్చి తలుపు కొట్టారు. భర్త ఇంట్లో ఉన్నారా అని అడిగారు. లేరని చెప్పగానే వివాహితను బెదిరించి ఇంట్లో రూ. 2.50 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, సొమ్ము చోరీ చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పలు గ్రామాల్లో ఉపాధి గ్రామ సభలు



ఉంగుటూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2025-26 వార్షిక ప్రణాళిక పనుల గుర్తింపు గ్రామ సభల్లో 317 పనులు ఆమోదించినట్లు ఏపీవో వినీల తెలిపారు. మండలంలోని పెద్ద అవుటపల్లి, ఆత్కూరు, నారయ్య అప్పారావు పేట, పొట్టిపాడు, కొయ్యగూరపాడు, ఆముదాలపల్లి, ఉంగుటూరు, లంకపల్లి అగ్రహారం, ముక్కపాడు గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సదస్సును జయప్రదం చేయండి

నున్న(విజయవాడరూరల్): విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ కోరారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం, పాతపాడు, నున్న గ్రామాల్లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులను, కార్యకర్తలను వివిధ రాజకీయ పార్టీల నేతలను కలిసి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ హాజరవుతారని తెలిపారు. ఎంఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంద వెంకటేశ్వరరావు మాదిగ, గన్నవరం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ బాధ్యులు మంద వేణుమాదిగ, పొరిటిగడ్డ దేవదాసు మాదిగ, ఇందుపల్లి జకరయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడికి స్మార్ట్ షాక్

- కానుల కోసం విద్యుత్ స్మార్ట్ మీటర్లు
- మొదటి దశలో ప్రభుత్వ కార్యాలయాలు..
- రెండవ దశలో వాణిజ్య-గృహాలకు ఏర్పాటు





పెనమలూరులో ప్రభుత్వ కార్యాలయాలకు అమర్చిన స్మార్ట్ విద్యుత్ మీటర్లు

పెనమలూరు: ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ స్మార్ట్ మీటర్లపై దుష్ప్రచారం చేసిన టీడీపీ నేతలు అధికారంలోకి రాగానే వాటి అమలు ఆగమేఘాల మీద చేపట్టారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే ఇక విద్యుత్ వాడకంపై రీడింగ్, బిల్లింగ్ పూర్తిగా ప్రైవేటు పరం కానుంది. దీంతో విద్యుత్ వినియోగదారులకు భవిష్యత్తులో విద్యుత్ బిల్లులు షాక్‌ల మీద షాక్‌లు కొట్టనున్నాయి. వివరాల్లోకి వెళితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై దృష్టి పెట్టింది. ఇంతకాలం వినియోగదారులకు ఎలక్ట్రానిక్ మీటర్లు(ఐఆర్) స్థానంలో స్మార్ట్ విద్యుత్ మీటర్లు అమర్చుతున్నారు. ఇంత వరకు విద్యుత్ మీటర్లకు ప్రతి నెలా రీడింగ్ తీసి బిల్లు వినియోగదారుడికి అందజేస్తే ఆన్‌లైన్‌లో లేదా విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన కౌంటర్లలో బిల్లులు చెల్లించేవారు. ఈ విధానంలో విద్యుత్ వినియోగదారులకు బిల్లు చెల్లించడానికి కొద్ది రోజులు గడువు ఉండేది. సొమ్ము సమకూర్చుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించేవారు.

సంక్షేమ పథకాలకు ఇబ్బంది

ప్రభుత్వం తాజాగా అమలులోకి తీసుకువచ్చిన స్మార్ట్ మీటర్లు విద్యుత్ వినియోగదారులను టార్గెట్ చేయనున్నాయి. విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చితే ప్రతి నెలా ఒకటి నుంచి 30వ తేదీ అర్ధరాత్రి గడిచిన వెంటనే బిల్లు వాట్సప్ లేదా మెసేజ్ రూపంలో వస్తుంది. స్మార్ట్ మీటర్లు ప్రీపెయిడ్ మీటర్లు కావడంతో ఒక నెల ముందుగానే విద్యుత్ వినియోగదారులు సొమ్ము బ్యాలెన్స్ అకౌంట్‌లో జమ చేసి ఉంచాల్సి ఉంటుంది. పైగా విద్యుత్ ఎంత వాడుతుంది, ఎంత లోడ్ అవసరముంది, ఎక్కువ లోడ్ వాడితే కట్టిన డిపాజిట్ ఎంత పెంచాలి అన్నీ రికార్డు అవుతాయి. పైగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందే వారికి ఈ వివరాలు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంటుంది.

తొలిదశలో ప్రభుత్వ కార్యాలయాలకు..

తొలిదశలో ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ విద్యుత్ మీటర్లు అమలు చేస్తున్నారు. కానూరు సబ్ డివిజన్ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, వీధి దీపాలకు మొత్తం 1,028 కనెక్షన్లు ఉండగా వాటికి స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రైవేటు సంస్థ వేగంగా చేపట్టింది. ఎంపీడీవో, తహసీల్దార్, గ్రామ పంచాయతీలకు విద్యుత్ శాఖతో సంబంధం లేకుండా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. రెండవ దశలో వాణిజ్య, గృహ అవసరాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తారు.

కానూరు సబ్ డివిజన్‌లో..

కానూరు సబ్ డివిజన్‌లో వాణిజ్య కనెక్షన్ల వివరాలు ఇలా ఉన్నాయి. కానూరు సబ్ డివిజన్‌లో మొత్తం 15,439 వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. యనమలకుదురు సెక్షన్‌లో 3,038, పోరంకిలో 2,344, పెనమలూరులో 1,384, కానూరులో 5,780, కంకిపాడులో 2,893 చొప్పున వాణిజ్య కనెక్షన్లు ఉండగా ఈ నెలాఖరు కల్లా స్మార్ట్ మీటర్లు అమర్చుతారు. ఇక గృహ విద్యుత్ కనెక్షన్లు సబ్‌డివిజన్‌లో మొత్తం 98 వేల వరకు ఉన్నాయి. ఈ ఏడాది చివరి నాటికల్లా స్మార్ట్ మీటర్లు గృహాలకు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరు చెబితే చాలు సామాన్యులు హడలిపోతున్నారు.

గృహ విద్యుత్ వినియోగంపై ఆంక్షలు వద్దు



తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానీప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిన్నా

పెనమలూరు: గృహ విద్యుత్ వినియోగంపై కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధించరాదని రాష్ట్ర నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ చిన్నా పేర్కొన్నారు. ఈ మేరకు తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ భవానీప్రసాద్‌కు శుక్రవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నా వివరాలు తెలుపుతూ.. గృహ అవసరాలకు 300 యూనిట్ల విద్యుత్ వినియోగించుకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు చదువుకోవాలన్నా, ఇంటర్నెట్ సేవలు పొందాలన్నా విద్యుత్ అవసరం చాలా ఉంటుందన్నారు. దీంతో 300 యూనిట్ల విద్యుత్ వినియోగం దాటిపోతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు గమనించి విద్యుత్ వినియోగంపై ఆంక్షలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి షేక్ మీరాబీ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



మాట్లాడుతున్న ఏడుకొండలు




గన్నవరంలో గాంధీ, అంబేద్కర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు

విజయవాడరూరల్: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి (జీపీడీపీ) ప్రణాళిక దోహదం చేస్తుందని జీపీడీపీ ఉమ్మడి కృష్ణ, ఉభయగోదావరి జిల్లాల కన్సల్‌టెంట్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఏడుకొండలు అన్నారు. శుక్రవారం విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో రెండవ రోజు జరిగిన జీపీడీపీ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చేతివృత్తులపై యూనిట్స్ స్థాపించడానికి అవసరమైన బ్యాంక్ రుణాలు పొందాలంటే ముందుగా గ్రామసభల్లో పాల్గొని తీర్మాణం పొందాలన్నారు. స్కిల్డ్, అన్‌స్కిల్డ్ మహిళలకు గ్రామసభలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఈఓఆర్డీ ఎంపీడీ దుర్గాప్రసాద్, ఎంపీడీఓ బి. విగ్గిన్స్, ఏపీఎం జి. చంద్రశేఖర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుహాసిని, ఏఓ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ముగిసిన జీపీడీపీ శిక్షణ

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న మండల, గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024-25 కార్యాచరణపై శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజున మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. తొలుత మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి నివాళులర్పించారు. అనంతరం గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ టి. స్వర్ణలత, ఈఓపీఆర్డీ టి. భారతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి



పొద్దుటూరు శివాలయంలో ఓంకార రూపంలో దీపాలు



రామవరప్పాడులో ఇప్పపూల అలంకరణలో స్వామివారు

కంకిపాడు: కార్తిక మాసంలో అతిముఖ్యమైన కార్తిక పౌర్ణమిని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శుక్రవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా వేకువజాము నుంచే శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణాల్లో దీపాలు వెలిగించి స్వామిని ఆరాధించి భక్తిపారవశ్యం చెందారు. పౌర్ణమి సందర్భంగా జ్వాలా తోరణం వెలిగించారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పిన్నమనేని హైట్స్ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు కందిమళ్ల అంజనీకుమారి, ఆంజనేయ దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్తిక పౌర్ణమి పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివలింగ ప్రతిమ వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. భద్రాచలం నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన ఇప్పపూలతో స్వామివార్లను సుందరంగా అలంకరించారు. స్వామివార్లకు పంచామృత అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజ, వారాహి అమ్మవారికి అష్టోత్తరం పూజలు ప్రతి రోజూ నిర్వహిస్తున్నారు.

విజయవాడరూరల్: నున్న గ్రామంలోని చినకంచి శివాలయం, శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానాల్లో కార్తిక పౌర్ణమి సందర్భంగా అఖండ జ్యోతులు వెలిగించి స్వామివారిని సేవించారు. నోములు నోచుకొని అభిషేకాలు చేశారు. పాతపాడు గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం, పి.నైనవరం గ్రామంలో శ్రీ శివ నాగేంద్రస్వామి ఆలయంలో భక్తులు పూజలు, దీపారాధనలు చేశారు.

వైభవంగా జ్వాలతోరణ మహోత్సవం

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీలాక్షి అన్నపూర్ణదేవి సహిత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం జ్వాలాతోరణ మహోత్సవం నిర్వహించారు. తొలుత కార్తిక పౌర్ణమి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, చందనంతో అలంకరణ చేశారు. అనంతరం అమ్మవార్లను గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కాసరనేని శ్రీనివాసరావు, కాట్రగడ్డ రామశేషు దంపతులచే స్వామివారికి పూజలు జరిపారు. అనంతరం అశేష భక్తజనం సమక్షంలో జ్వాలతోరణం వెలింగించారు. ఆలయ కమిటీ సభ్యులు, పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.



యనమలకుదురు ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

యనమలకుదురులో..

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం రాత్రి కార్తిక పౌర్ణమి సందర్భంగా దీపోత్సవం ఘనంగా చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో రాత్రి పొద్దుపోయే వరకు క్యూలైన్‌లో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. పెనమలూరు పెద్ద గుడి, పోరంకి శివాలయంలో కూడా భక్తులు పెద్ద ఎత్తున దీపారాధన చేశారు.



జ్వాలతోరణ మహోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు



నున్న చినకంచి శివాలయంలో స్వామివారికి అభిషేకం

'డ్రింకర్ సాయి' చిత్రం టీజర్ రిలీజ్



వేదికపై హీరో, హీరోయిన్లు ధర్మా మహేష్, ఐశ్వర్య శర్మ, యూనిట్ సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక కేఎస్ టాకీస్‌లో 'డ్రింకర్ సాయి' చిత్రం టీజర్ రిలీజ్ ఫంక్షన్ శుక్రవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. అభిమానుల కోలాహలం మధ్య వర్ధమాన సినీ హీరో ధర్మా మహేష్ నటించిన రెండో సినిమా టీజర్‌ను విడుదల చేశారు. కిరణ్ తిరుమలశెట్టి నిజజీవితంలో జరిగిన ఓ వాస్తవ ప్రేమకథ ఆధారంగా డ్రింకర్ సాయి చిత్రాన్ని తెరకెక్కించారు. ఎవరెస్ట్ సినీమాస్, స్మార్ట్ స్క్రీన్స్ పతాకంపై బసవరాజు శ్రీనివాస్, లహరిధర్, షేక్ ఇస్మాయిల్ నిర్మాతలుగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రలో నటించిన అంబర్‌పేట్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. హీరో ధర్మా మహేష్ మాట్లాడుతూ తనకు నటనలో ఓనమాలు నేర్పిన వైజాగ్ సత్యానంద్‌కు, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి హీరో ధర్మా మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. హీరోయిన్ ఐశ్వర్య శర్మ, దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి, నిర్మాత షేక్ ఇస్మాయిల్, లహరిధర్ మాట్లాడుతూ ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుందన్నారు.

పుస్తక పఠనంతో మేధో వికాసం



తెన్నేరు శాఖా గ్రంథాలయంలో చిన్నారులు



గన్నవరంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంపీపీ రవి



పెనమలూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో ఎంపీడీవో ప్రణవి

కంకిపాడు: పుస్తక పఠనంతో మేధో వికాసం సాధ్యమవుతుందని గ్రంథాలయ కమిటీ సభ్యురాలు సాయిలీలా అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని తెన్నేరు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను చిన్నారులు పఠించారు. సాయిలీలా మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎస్. సునీత పర్యవేక్షించారు.

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. తొలుత పుస్తక ప్రదర్శనను ఎంపీపీ అనగాని రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చెప్పారు. చరిత్రలో ఎంతో మంది గ్రంథాలయాల వల్ల గొప్ప వ్యక్తులుగా ఎదిగారని పేర్కొన్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావు, సభ్యుడు చిమట రామారావు, గ్రంథాలయ ఇన్‌చార్జ్ పీడీ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరు: పెనమలూరు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో బండి ప్రణవి మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిత్రలేఖనంలో పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి పి.హరీష, విద్యార్థులు పాల్గొన్నారు. వణుకూరు శాఖా గ్రంథాలయంలోనూ పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ అధికారి భారతి పాల్గొన్నారు.

ఉంగుటూరు: ఆత్కూరు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను శుక్రవారంమాజీ వైస్ ఎంపీపీ ఆర్నేపల్లి సింహాచలం ప్రారంభించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అదేవిధంగా ఉంగుటూరు, తేలప్రోలు, మానికొండ గ్రామాల్లోని జిల్లా శాఖా గ్రంథాలయాల్లో వారోత్సవాలు కొనసాగుతున్నాయి. గ్రంథాలయ అధికారులు కృష్ణారావు, హరికృష్ణ, శ్రీనివాసరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉయ్యూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉయ్యూరు, ముదునూరు గ్రంథాలయాల్లో శుక్రవారం పుస్తక ప్రదర్శన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. ఉయ్యూరు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను డీవైఈఓ పద్మారాణి ప్రారంభించారు. ముదునూరులో వారోత్సవాలను గ్రంథాలయాధికారి నాగరాజు పర్యవేక్షించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని వీరవల్లి, కానుమోలు, బాపులపాడు శాఖా గ్రంథాలయాల్లో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు జె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, చిన్నరాజు, స్వర్ణలతాదేవి పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి షేక్ ఇమాం పేర్కొన్నారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇమాం మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల మేధో సంపత్తి వికసిస్తుందని తెలిపారు. స్థానిక నవభారత్ హైస్కూల్, ఎంపీపీ స్పెషల్, ఉర్దూ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. గ్రామ పెద్ద వి.శేషగిరిరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులకు మిఠాయిలు అందజేశారు. పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కృపానందం ఆధ్వర్యాన పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు పుస్తక పఠనంలో పాల్గొన్నారు.



ఉయ్యూరు గ్రంథాలయంలో వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు



ముస్తాబాదలో పుస్తక పఠనంలో విద్యార్థులు



ఆత్కూరులో పుస్తక ప్రదర్శన

వృక్ష సంపద.. అక్రమార్కుల పాలు

ముఠాకు అండగా జనసేన నేత



పెదపులిపాక వద్ద పట్టుబడిన కలప లోడ్‌తో ఉన్న ట్రాక్టర్, కూలీలు

పెనమలూరు: ఎర్ర చందనం దొంగల్లా పెనమలూరులో వృక్షాలు నరికే దొంగలు తెరపైకి వచ్చారు. కూటమి పాలనలో ఇసుక దందాతోపాటు తాజాగా పెద్ద పెద్ద వృక్షాలను నరికి దుంగలు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే విజయవాడ-అవనిగడ్డ కరకట్టపై కేఈబీ కెనాల్ కాలువ కట్టపై చాలా సంవత్సరాల క్రితం నాటిన మొక్కలు నేడు మహావృక్షాలుగా పెరిగాయి. రహదారికి ఇరుపక్కల పచ్చదనం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక్కడ చెట్లను నరికి దుంగలు అమ్మి సొమ్ము చేసుకునేందుకు మాఫియా రంగంలోకి దిగింది. గత కొద్ది రోజులుగా కరకట్ట వెంట మహావృక్షాలు మాయమవుతున్నాయి.

మహావృక్షాలే టార్గెట్

కలపకు మంచి ధర పలకడంతో చెట్లను నరికే మిషెన్‌లతో రంగంలోకి దిగారు. యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం ప్రాంతాల్లో కరకట్ట వెంట ఉన్న మహావృక్షాలపై మాఫియా కన్ను పడింది. ట్రాక్టర్, కూలీలతో వచ్చి వృక్షాలను నరికి విలువైన కలపను తరలిస్తున్నారు. పెదపులిపాక పంచాయతీ పరిధిలో శుక్రవారం ట్రాక్టర్‌లో కూలీలతో వచ్చి చెట్లను నరికి దుంగలు తరలిస్తుండగా పట్టుకున్నారు. కలప లోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే జనసేన నేత తెరపైకి వచ్చి పంచాయతీ అధికారులకు ఫోన్ చేసి కలపతో ఉన్న ట్రాక్టర్‌ను వదిలేయాలని హుకుం జారీ చేశాడు. గ్రామస్తులు ససేమిరా అనడంతో ట్రాక్టర్ పంచాయతీ కార్యాలయం వద్ద ఉంచారు.

అధికారులు చర్యలు తీసుకుంటారా..?

మొక్కలు నాటండి, పెంచండి, ప్రతీ మొక్కను సంరక్షించండని ప్రకటనలు చేస్తున్న అధికారులు ఈ ఘటనపై చర్యలు తీసుకుంటారా లేదా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. బహిరంగంగా వృక్షాలు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఫారెస్టు అధికారులు, రెవెన్యూ, పోలీసులు ఏం చర్యలు తీసుకుంటారా అని గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు.

● రేషన్‌బియ్యం పట్టివేత

పెనమలూరు: యనమలకుదురులో ఓ వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. గురువారం రాత్రి యనమలకుదురు చేపల మార్కెట్ వద్ద కోలవెన్ను మాదాసువారిపాలెంకు చెందిన ముత్తిరెడ్డి వెంకటశివరావు 120 కేజీల రేషన్ బియ్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.